
క్లుప్తంగా

రేపు షిరిడీసాయి మందిర వార్షికోత్సవం



సిరిపురంలోని షిరిడీ సాయిబాబా

కరప: మండలం సిరిపురంలో షిరిడీసాయి మందిర రెండో వార్షికోత్సవం శనివారం నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త చిక్కాల వీరవెంకటసత్యనారాయణ (దొరబాబు) గురువారం తెలిపారు. శనివారం ఉదయం 5.15 గంటలకు షిరిడీసాయిబాబాకు కాకడ హారతి, ఆరు గంటలకు సుప్రభాతం, ఏడు గంటలకు బాబాకు అభిషేకాలు, 8.30 గంటలకు సామూహిక సాయి సత్యవ్రతాలు, 10 గంటలకు స్వామివారికి చందనోత్సవం జరుగుతాయన్నారు. ముందురోజు శుక్రవారం సాయంత్రం షిరిడీ సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి గ్రామోత్సవం జరుపుతామని ఆయన చెప్పారు. సిరిపురం, కరప పరిసర మండలాల్లోని భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ ధర్మకర్త దొరబాబు కోరారు.

రోటరీ గోల్డ్ సభ్యులకు జిల్లాలో సేవా పదవులు

బోట్‌క్లబ్: రోటరీ డిస్ట్రిక్ట్ నూతన గవర్నర్‌గా దత్త సుబ్బారావు జూలై నెలలో బాధ్యతలు చేపడుతున్న నేపథ్యంలో రోటరీ గోల్డెన్ జూబ్లీక్లబ్‌కు చెందిన పలువురిని రోటరీ డిస్ట్రిక్ట్‌లో పలు సేవా పదవులకు ఎంపిక చేశారు. రోటరీ మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్‌వీఎస్ రావును వొకేషనల్ ట్రైనింగ్ టీమ్ డిస్ట్రిక్ చైర్ పర్సన్‌గా ఎంపిక చేశారు. అప్పసాని కృష్ణకుమారికి ఉమెన్ ఎంపవర్‌మెంట్ కో చైర్మన్‌గా, వాడ్రేవు రవికి కమ్యూనిటీ మెడికల్ కమిటీ చైర్‌పర్సన్‌గా, సతీష్‌ను డెంటల్ కేర్ కమ్యూనిటీ మెడికల్ చైర్మన్‌గా, వైవీ పరశురామ్‌ను పబ్లిక్ రిలేషన్స్, క్లబ్ సర్వీస్ కో చైర్‌పర్సన్‌గా నియమించారు.

ఉపాధి హామీ నిధులు సవరించాలి

కాకినాడ సిటీ: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఉపాధి హామీ నిధులకు కోత పెట్టిందని దీంతో ఆ కార్మికులు పనులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా విస్తృత సమావేశం విమర్శించింది. గురువారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. బడ్జెట్ తగ్గింపు ఉపాధి కూలీలను అనేక బాధలకు గురి చేస్తోందన్నారు. మరో పక్క నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, వేతనాలు మాత్రం పెంచడంలేదని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచడం వల్ల కూలీల పరిస్థితి అగమ్యగోచరమైందన్నారు. ఉపాధి హామీని నిర్వీర్యం చేయడానికి అనేక కొత్త పద్ధతులను ప్రవేశపెట్టి పొమ్మనకుండా పొగపెట్టే విధంగా మోడీ అవలంబించే ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన చేపడుతున్నట్టు తెలిపారు. బడ్జెట్‌ను సవరించి ఉపాధి హామీ పథకానికి లక్ష కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్, నాయకులు కూరాకుల సింహాచలం, కె.రాఘవ, యు.బుల్లెబ్బాయి, ఆర్.భూలోకం, అదృష్టదేవుడు తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల ఐదున చలో ఢిల్లీ

కాకినాడ సిటీ: కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న చేపట్టిన ఛలో ఢిల్లీని జయప్రదం చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.బేబీ రాణి పిలుపునిచ్చారు. గురువారం కాకినాడలో జిల్లా సీఐటీయూ భవనంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకత్వ శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆశా వర్కర్లకు ఫేస్ రికగ్నిషన్ యాప్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తరగతుల్లో సీఐటీయూ నాయకులు పలివెల వీరబాబు, చెక్కల రాజ్‌కుమార్, నల్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ: కాకినాడ జగన్నాథపురం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో డీఈ జి.ప్రసాద్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని ఏసువారివీధి, చిన్నమార్కెట్ వీధి, విష్ణాలయంవీధి, గుడిమెట్లవారివీధి, చర్చిస్క్వేర్, జగన్నాథపురం పాత వంతెన, నరసింహారోడ్డు, వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

టీడీపీ నేతల పర్యటన

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ తూరంగి సాయినగర్, గోపీకృష్ణాకాలనీలలో ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమాలను రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, పిల్లి సత్యనారాయణమూర్తి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుంగా సింహాద్రి, మట్టా ప్రకాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతం చేయండి

- కమిషనర్ నాగనరసింహారావు
- అధికారులతో సమీక్ష సమావేశం



ప్లానింగ్ సూపర్‌వైజర్లు, ఇంజినీరింగ్ సిబ్బందితో సమీక్షిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష పథకం కింద చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి పూర్తిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు కోరారు. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం భూముల రీ-సర్వే అంశంపై కమిషనర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సీడీఎంఏ నుంచి 16ఏ ఫార్మేట్‌లో వచ్చిన ఆదేశాల ప్రకారం ఆయా అసెస్‌మెంట్ నెంబర్లు, ఇతర సమాచారాన్ని సర్వే నెంబర్‌కు అనుసంధానం చేయాలన్నారు. వందేళ్ల తర్వాత జరుగుతున్న రీ సర్వే వల్ల ఎన్నో భూ వివాదాలకు, సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అర్బన్ రీసర్వేను అత్యంత ప్రణాళిక బద్ధంగా, పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారం రోజుల వ్యవధిలో ప్రగతి సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఏసీపీ నాగ శాస్త్రులు, సూపర్‌వైజర్లుగా నియమితులైన ఏఈలు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు, ఆర్‌ఐలు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు

- 101 మంది మహిళలు సారె సమర్పణ



ఆలయ మండపంలో కలశాలకు పూజలు చేస్తున్న మహిళలు



కరపలో కలశాలు, సారెతో ఊరేగింపుగా వస్తున్న వేములవాడ మహిళలు

కరప: గ్రామదేవత ఉప్పాలమ్మతల్లి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో ప్రతి గురువారం అమ్మవారికి పూజలు, నైవేద్యాలు సమర్పిస్తున్నారని ఆలయ కమిటీ చైర్మన్ చిన్నారి మురళీకృష్ణ తెలిపారు. గ్రామస్తులతో పాటు, పరిసర గ్రామాలవారు ప్రతీవారం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా వేములవాడ సర్పంచ్ కమిడి మంగాదేవి, శంకర దంపతులు ఆ గ్రామానికి చెందిన 101 మంది మహిళలు కలశాల పట్టుకుని, సారె పెట్టి ఊరేగింపుగా మూడు కిలోమీటర్లు పాదయాత్ర చేసి కరప చేరుకున్నారు. అనంతరం దుర్గాదేవి ఆలయానికెళ్లి తర్వాత ఉప్పాలమ్మ ఆలయానికి వెళ్లి కలశాలను, సారెను ఉంచి లలితా నామాలతో ప్రత్యేకపూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు దంపతులు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ మురళీకృష్ణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నక్కా వీరభద్రరావు, చోడపునీడి వెంకటరమణ, సాదే లోహిదాస్‌కుమార్, ముద్రగడ వీరబాబు తదితరులు వేములవాడ మహిళలకు స్వాగతం పలికి, పూజా కార్యక్రమాలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కాకినాడ రూరల్: కాకినాడ బీచ్‌రోడ్డు పాత శిల్పారామం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలం నేమాం గ్రామానికి చెందిన వాసంశెట్టి నాని(30) దుర్మరణం చెందాడు. సర్పవరం పోలీసుల వివరాలు ప్రకారం వాకలపూడిలో సెల్‌ఫోన్ రిపేరు షాపు నిర్వహించే నాని పల్సర్ బైక్‌పై బీచ్‌రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నానికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోదరుడు లోవరాజు ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. నాని మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

శ్లాబ్ పెచ్చులు పడి రోగి బంధువుకు గాయాలు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో సర్జికల్ వార్డు ఎస్ 3లో పెచ్చులూడి పడ్డాయి. ఈ ఘటనలో ఓ రోగి బంధువుకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలిని ఆసుపత్రి అధికారులు పరిశీలించి తక్షణ మరమ్మతులకు ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం వివిధ వార్డుల్లో బలహీనంగా ఉన్న పైకప్పుల భాగాలు, గోడలను నిర్మాణ బృందం పరిశీలించింది. మరమ్మతులు అవసరమయ్యే పలు వార్డులను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించనున్నారు.

ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలి



జేఎన్‌టీయూకే గేటు వద్ద కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేస్తున్న గిరిజన ఐక్య వేదిక ప్రతినిధులు

కాకినాడ సిటీ: తెలంగాణ రాష్ట్రంలో డాక్టర్ ప్రీతి నాయక్ మరణానికి కారణమైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని కోరుతూ గురువారం రాత్రి కాకినాడ జేఎన్‌టీయూకే ముందు గిరిజన ఐక్యవేదిక ప్రతినిధులు కొవ్వొత్తుల వెలిగించి నిరసన ప్రదర్శన చేశారు. ఐక్యవేదిక ప్రతినిధులు ప్రొఫెసర్ బీఆర్ దొరస్వామి నాయక్, డాక్టర్ మధుకుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు కె.రమేష్, సురేష్, అనిల్, రంజిత్, విక్రమ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. సమాజానికి సేవ చేయాలనే తపనతో ఎంతో ఉన్నతమైన ఆలోచనలతో కాకతీయ మెడికల్ కళాశాలలో పీజీ మెడిసిన్ చదువుతున్న విద్యార్థిని అని, ఆమె మరణంపై సమగ్ర విచారణ జరిపి నిందితుడు డాక్టర్ సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రూ.80 లక్షలతో రెడ్ కాన్వెంట్ ట్రస్ట్ సేవలు



సహాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

బాలాజీచెరువు: పూర్వ విద్యార్థులందరూ కలసి ఏర్పాటు చేసుకున్న రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ (1978) ఆరేళ్లలో రూ.80 లక్షల సేవా కార్యక్రమాలు చేసిందని ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. రామారావుపేట లయన్స్ కార్యాలయంలో గురువారం ట్రస్ట్ ద్వారా రూ.54 వేల విలువైన వినికిడి యంత్రాలు, డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థి ప్రియాంకకు రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ చైర్మన్ బచ్చు కమలబాబు అందజేసారు. అనంతరం 40 మంది పేదలకు కళ్లజోళ్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు సీమకుర్తి పాపారావు, కల్యాణి, శేషగిరి, శారద, రామచరణ్ పాల్గొన్నారు.

మచిలీపట్నంలో జనసేన ఆవిర్భావ వేడుకలు

బాలాజీచెరువు: జనసేన పార్టీ పదో ఆవిర్భావ దినోత్సవాలను మచిలీపట్నంలో నిర్వహించాలని అధిష్టానం నిర్ణయించినట్టు పార్టీ నగర ఇన్‌చార్జి ముత్తా శశిధర్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆ వేడుకల విశేషాలను వివరిస్తూ సభా వేదికకు పొట్టి శ్రీరాములు వేదికగా పేరు పెట్టినట్టు తెలిపారు.

మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగి దందాపై ఫిర్యాదు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో ఒక కాంట్రాక్టు ఉద్యోగి దందా రోజు రోజుకూ పెరిగి పోతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు గురువారం దీనిపై రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు వద్ద పంచాయతీ జరిగింది. గత టీడీపీ పాలనలో మున్సిపాలిటీ పరిధిలో అనేక మందిని కాంట్రాక్టు ఉద్యోగులుగా నియమించారు. మున్సిపాలిటీ పరిధిలో ఔట్ సోర్సింగ్ పని చేస్తున్న ఒక ఉద్యోగి పట్టణ పరిధిలో వ్యాపారులతో పాటు సినిమా థియేటర్ల వద్ద దందా చేస్తూ పీడిస్తున్నాడని అతనిని తొలగించాలని అధికార పక్ష కౌన్సిలర్లు దొరబాబు వద్ద మొరపెట్టుకున్నారు.

నిరుపేద క్రీడాకారులకు చేయూత



గిరిజన యువకులకు క్రీడా కిట్లు అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ హరీష్

బాలాజీచెరువు: పోలీస్, ఆర్మీ వంటి పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుపేదలకు చేయూత ఇస్తానని హరీష్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్ తెలిపారు. సీలేరు గిరిజన ప్రాంతానికి చెందిన యువతీ యువకులు 20 మందికి గురువారం క్రీడా సామగ్రిని అందజేశారు. అర్హత ఉండీ, సరైన సదుపాయాలు లేక ఉద్యోగాలకు దూరం అవుతున్నారని, అవసరమైన వారికి తమ ట్రస్ట్ ద్వారా సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు హరీష్ తెలిపారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

- కరోనా అనంతరం మారిన జీవనశైలి
- ప్రజల్లో పెరిగిన ఆరోగ్య స్పృహ



ఆసనాలు నేర్పిస్తున్న యోగా గురువు

పెద్దాపురం: ప్రపంచ దేశాలను వణికించిన కరోనా ప్రజల జీవన విధానాన్నే మార్చేసింది. ఉప్పెనల విరుచుకుపడ్డ కోవిడ్ సెకండ్ వేవ్ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపించింది. ఈ నేపథ్యంలో ఆరోగ్య సంరక్షణపై ప్రజలు దృష్టి సారించారు. ఇప్పుడు ఏ ఇద్దరు కలిసినా ఆరోగ్యం కోసం ఎలాంటి ఆహారం తీసుకోవాలన్న విషయంపైనే చర్చ జరుగుతుంది. పట్టణ ప్రజలు యోగా, ధ్యానం (మెడిటేషన్)తో పాటు శ్వాస వ్యాయామాలు (బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు) చేస్తున్నారు. ఊబకాయులపై కరోనా ప్రభావం చూపుతుండడంతో బరువు తగ్గే ప్రయత్నాలు చేస్తున్నారు.

యోగా, ధ్యానంపై ప్రత్యేక దృష్టి

పట్టణ వాసులు ఉరుకులు, పరుగుల జీవన విధానంలో తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. దీంతో మధ్యవయసులోనే మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధుల బారిన పడుతున్నారు. వాటి నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగా, ధ్యానంపై దృష్టి సారిస్తున్నారు. కొందరు ఇళ్లల్లోనే యోగా, ధ్యానం చేస్తుంటే మరికొందరు శిక్షణ కేంద్రాలకు వెలుతున్నారు. ఊపిరితిత్తులపై కరోనా తీవ్ర ప్రభావం చూపిన నేపథ్యంలో శ్వాస వ్యాయామాలు చేస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. ఇంట్లోనే రోజూ శ్వాస వ్యాయామాలు చేస్తున్నారు.

కిటకిటలాడుతున్న వాకింగ్ ట్రాక్‌లు

కరోనా పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ ట్రాక్‌లన్నీ వాకర్లతో కిటకిటలాడుతున్నాయి. వీలును బట్టి ఉదయం లేదా సాయంత్రం కొద్దిసేపు వ్యాయామం చేసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలోని కాకినాడ గాంధీ నగర్ పార్కు, బోట్‌క్లబ్ పార్కు, పెద్దాపురం పట్టణంలో శతాబ్ది పార్కు, సామర్లకోటలోని సీబీఎం కళాశాల మైదానం, పిఠాపురం పార్కుల్లో ఉన్న పలు వాకింగ్ ట్రాక్‌లు వాకర్లతో నిండిపోతున్నాయి. నడక, వ్యాయామం, దేహదారుఢ్యం పెంచుకునేందుకు ప్రాధాన్యత నిస్తున్నారు.

పెరిగిన ఫ్రూట్, డ్రైఫ్రూట్స్ వాడకం

శరీరంలోని వ్యాధినిరోధక శక్తిని పెంచుకునేందుకు ప్రజలు ప్రయత్నిస్తున్నారు. దీంతో ఫ్రూట్స్, డ్రైఫ్రూట్స్ వినియోగం గత రెండేళ్లు ఎక్కువైంది. ముఖ్యంగా సీజనల్ ఫ్రూట్స్‌తో పాటు ఆపిల్, కివీ,, ఖర్బూజ, బొప్పాయి, దానిమ్మ వంటి వాటికి గిరాకీ పెరిగింది. కాకినాడ నగరంతో పాటు, జిల్లాలోని పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం, తుని పట్టణాలతో పాటు మండల కేంద్రాలైన జగ్గంపేట, ఏలేశ్వరం తదితర ప్రాంతాల్లో కొత్తగా అనేక డ్రైఫ్రూట్స్ స్టాల్స్ వెలిశాయి.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు

కాకినాడ సిటీ: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ బాదం బాలకృష్ణ, తూరంగి మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్ అన్నారు. గురువారం కాకినాడ రూరల్ మండలం తూరంగి అల్లూరి సీతారామరాజునగర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మధుమేహ వ్యాధిపై అవగాహన నిర్ధారణ సదస్సు నిర్వహించి, ఉచిత షుగర్ వ్యాధి పరీక్షలు, వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులు ప్రతి నెల క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. మధుమేహ వ్యాధి నిర్ధారణ అయిన వ్యక్తులకు లయన్స్ క్లబ్‌చే గుర్తింపు పొందిన ఆస్పత్రిలో ఆరు నెలల పాటు ఉచిత కన్సల్టేషన్ ఇస్తామని బాలకృష్ణ అన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు నేరెళ్ల మురళీకృష్ణ, దొడ్డి రామసుబ్రహ్మణ్యం, మేడిశెట్టి వెంకటరమణ, జీఎల్ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునుడి కల్యాణోత్సవాలు



స్వామివారి పల్లకి మోస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: స్థానిక కొవ్వాడలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయ ఆరో వార్షిక కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అనంతరం పల్లకి సేవ చేశారు. నియోజకవర్గ అభివృద్ధికమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, భక్తులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

కుటుంబ విలువలతోనే వ్యక్తిత్వ వికాసం



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు

బాలాజీచెరువు: కుటుంబ విలువలతోనే వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని శ్రీచైతన్య పాఠశాల ఏజీఎం సురేష్ పేర్కొన్నారు. సాంబమూర్తి నగర్ శ్రీచైతన్య పాఠశాలలో గురువారం ఫ్యామిలీ గ్లోరీ పేరుతో తల్లిదండ్రులకు తమ పిల్లలచే పాదపూజ చేయించారు. ఏజీఎం సురేష్ మాట్లాడుతూ కేవలం బట్టీ పట్టించే పాఠ్యాంశాలే కాకుండా చిన్నారుల్లో వ్యక్తిత్వ వికాసం, సాంస్కృతి సాంప్రదాయల విశిష్టత తెలియజేయడానికి ఇటువంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం చిన్నారులచే తమ తల్లిదండ్రులకు పాదపూజ చేయించారు. ఆర్ఐ గోపినాథ్, ప్రిన్సిపాల్ సుల్తానా, కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఇజ్రాయిల్‌కు అభినందనలు

కాకినాడ రూరల్: ఎమ్మెల్సీ అభ్యర్థి బొమ్మి ఇజ్రాయిల్‌ను ఆయన స్వగృహంలో గురువారం కాకినాడ రూరల్ ఎంఆర్‌పీఎస్ నాయకుడు సమరం చిట్టిబాబు, నాయకులు కలిసి అభినందించారు. సీఎం జగన్ సామాజిక న్యాయ పాలన చేస్తున్నారని మరోసారి నిరూపించారన్నారు. ఈ కార్యక్రమంలో గర్బాపు బాబూరావు, గర్బాపు పండు, గర్బాపు బాబి, మోర్త వినోద్ కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి కుమారస్వామి కల్యాణోత్సవాలు

బోట్‌క్లబ్: దేవాలయంవీధిలో భీమేశ్వర ఆలయ ప్రాంగణంలో ఉన్న వల్లీ దేవసేన సమేత కుమారస్వామి దివ్య కల్యాణోత్సవాలు గురువారం నుంచి 8వ తేదీ వరకూ జరుగుతాయని ఈఓ ఆర్.రాజేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3న ఉదయం స్వామికి పంచామృతాభిషేకం, రాత్రి 7.30కు కల్యాణం, 4న హోమం, బలిహరణ, 5న చందనోత్సవం, 6న హోమం, బలిహరణ, 7న త్రిశూల స్నానం, 8న శ్రీపుష్పయాగం జరుగుతాయన్నారు.

కాకినాడ-తునికి కొత్తగా అల్ట్రా పల్లెవెలుగు సర్వీసు

- డీపీటీవో శ్రీనివాసరావు



తుని-కాకినాడ బస్సును ప్రారంభిస్తున్న డీపీటీవో శ్రీనివాసరావు

కాకినాడ: కాకినాడ-తుని మధ్య కొత్తగా రెండు అల్ట్రా పల్లెవెలుగు బస్సులను ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ బస్సులను శుక్రవారం ఆయన కాకినాడ ఆర్టీసీ బస్సు డిపోలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం అత్యాధునిక అల్ట్రా పల్లె వెలుగు బస్సులను ప్రవేశపెట్టామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ డి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ కె.ప్రభాకరావు తదితరులు పాల్గొన్నారు.

మాధవుని సన్నిధిలో మందేసి చిందులు

- నిత్యకృత్యమైన నైట్ వాచ్‌మన్ వ్యవహారం
- ఈఓ మందలించినా మారని తీరు

బోట్‌క్లబ్: పరమ పవిత్రమైన దేవాలయంలోనికి స్నానం చేస్తే కానీ ఎవరూ ప్రవేశించరు. కానీ ఆ దేవుని ఆదాయంపై జీవించే ఒక ఉద్యోగి పూటుగా మద్యం తాగి విధులకు హాజరయ్యాడు. ఇది తప్పని ప్రశ్నించిన సిబ్బంది, అర్చకులపై అసభ్య పదజాలంతో దూషణలకు దిగాడు. ఇది ఒక రోజు కాదు తరచూ ఇలా జరగడంతో ఆలయ సిబ్బంది, అర్చకులు ఈఓకు ఫిర్యాదు చేశారు. స్థానిక దేవాలయంవీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో నైట్ వాచ్‌మే బి.నూకరాజు తరచూ ఇలా మద్యం తాగి విధులకు వస్తున్నాడు. ఇదేమిటని ప్రశ్నించిన వారిని నీకు దిక్కున్న వారితో చెప్పుకోమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు. ఇతని బాధలు భరించలేని ఆలయ సిబ్బంది, అర్చకులు ఈఓ రాపర్తి రాజేశ్వరరావుకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నూకరాజుకు ఈఓ నోటీసు జారీ చేశారు. తన తప్పును క్షమించాలని ఇకపై ఇలా జరగకుండా చూసుకుంటానని తను ఇచ్చిన సంజాయిషీలో పేర్కొన్నట్టు ఆలయ ఈఓ తెలిపారు. సంజాయిషీ ఇచ్చిన తర్వాత కూడా అతని తీరు మారకపోవడంతో సిబ్బంది, అర్చకులు దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆలయానికి వచ్చిన పలువురు భక్తులపై కూడా అతను ఇష్టానుసారంగా వ్యవహరించడంతో భక్తులు కూడా ఆలయ సిబ్బందికి అతని వ్యవహార శైలిపై ఫిర్యాదు చేస్తున్నారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం జంక్షన్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వినియోగదారుల పరిరక్షణ చట్టం-1986పై అవగాహన కల్పించారు. సంఘ ఉపాధ్యక్షుడు చదలవాడ హరిబాబు మాట్లాడుతూ డబ్బులు చెల్లించి పొందే సేవలు లేదా కొనుగోలు చేసిన వస్తు సేవల్లో లోపాలు ఉంటే వినియోగదారుల హక్కుల కింద ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. బాధితులు న్యాయవాదిని ప్రత్యేకంగా పెట్టుకోవలసిన అవసరం లేదని, నేరుగా కేసు వేసి వాదించుకోవచ్చునన్నారు. వినియోగదారులు హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1967, 1800 425 0082 నెంబర్ల ద్వారా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని హరిబాబు తెలిపారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో హరిబాబును సత్కరించారు. డీఎల్‌పీఓ భమిడిపాటి శివరామకృష్ణమూర్తి, జిల్లా వినియోగదారుల రక్షణ కౌన్సిల్ సభ్యులు హెచ్ఎస్ రామకృష్ణ, కొమ్మూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక జీవన శైలితో అనారోగ్యాలు

కాకినాడ రూరల్: ఆధునిక జీవన శైలి వల్ల దాదాపు ప్రతి ఒక్కరూ ఏదో ఒక మానసిక, శారీరక అనారోగ్యాలకు గురవుతున్నారని ప్రకృతి వైద్య నిపుణురాలు డాక్టర్ షేక్ పరహా కౌసర్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లోని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వంశపారంపర్యం, వ్యక్తిగత అలవాట్లు, వాతావరణ కాలుష్యం వలన పలువురు మానసిక, శారీరక వ్యాధులకు గురవుతున్నారన్నారు. ప్రకృతి సిద్ధంగా మన జీవన విధానం ఉంటే వీటిని అధిగమించవచ్చన్నారు. అడబాల రత్న ప్రసాద్, ఎస్. శ్రీ నగేష్, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన అపర్ణాదేవి కల్యాణోత్సవాలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో కొలువైన అపర్ణా సమేత నాగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఐదు రోజులుగా కనుల పండువగా నిర్వహించారు. తొలి రోజు అపర్ణా సమేత నాగేశ్వరస్వామి దివ్య కల్యాణం కనుల పండువగా నిర్వహించగా ప్రతి రోజు అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆకొండి ప్రభాకర శాస్త్రి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారి దివ్య కల్యాణాల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. గురువారం మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, రుద్రహోమం, నీరాజన మంత్ర పుష్పం, చతుర్వేద స్వస్తి, ఆశీర్వచనం, ప్రసాద వినియోగం, శ్రీపుష్పయాగం, తెప్పోత్సవం వైభవంగా నిర్వహించి ఉత్సావాలు ముగించారు.